www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 22 ఫిబ్రవరి 2024
5
కాకినాడ



సూర్యారావు మృతికి సిపిఎం సంతాపం


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ
సిపిఎం నాయకులు పలివెల వీరబాబు తండ్రి పలివెల సూర్యారావు మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి, జి.బేబీరాణి, కెఎస్.శ్రీనివాస్, సిపిఎం నాయకులు సిహెచ్.అజయ్‌కుమార్, కె.వీరబాబు, జుత్తుక శ్రీనివాస్, సిహెచ్.విజయకుమార్, ఐద్వా నాయకులు సిహెచ్.రమణి, సిఐటియు నాయకులు టి.రాజా, కె.సత్తిరాజు, మేడిశెట్టి వెంకటరమణ, మలకారమణ తదితరులు సూర్యారావు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

ఆమడ దూరంలో సంరక్షణ

- ఇళ్ల స్థలాల పేరుతో అడవుల ధ్వంసం
- వనాల పునరుద్ధరించాలన్న ఎన్‌జిటి
- ఆదేశాలను భేఖాతరు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి
పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్న ప్రకృతి ప్రసాదించిన మడ అడవుల సంరక్షణను కాకినాడ జిల్లాలోని అధికారులు గాలికి వదిలేసారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తీర ప్రాంతాలకు సహజ రక్షణ గోడలుగా ఉండడమే కాకుండా, సముద్ర తీర జీవవైవిధ్యంలో కీలక పాత్ర వహిస్తున్న వీటిపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి మనుషుల్ని, వన్యప్రాణుల్ని కీలకంగా కాపాడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు.

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో కాకినాడ నగరానికి చెందిన లబ్ధిదారులకు ఇచ్చేందుకు దుమ్ములపేట సమీపంలోని తీర ప్రాంతంలో సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మడ అడవులను అధికారులు గుర్తించారు. స్థానిక పాలకుల ఒత్తిడితో జీవవైవిధ్యానికి ప్రతీకగా ఉన్న ఈ ప్రాంతంలో 60 ఎకరాల్లోని మడఅడవిలోని చెట్లను పూర్తిగా నరికి వేసి గ్రావెల్‌తో పూడ్చి వేశారు.


గ్రావెల్ తో పూడ్చగా ఎటువంటి మొక్కలు లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న మడ అడవుల ప్రాంతం



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సుమారు 31 వేల మందికి ఇళ్ల స్థలాల కోసం 2020లో ఏకపక్షంగా వ్యవహరించి మడ అడవులను ధ్వంసం చేశారు. సంబంధిత స్థలాన్ని మెరక చేయడం కోసం సుమారు రూ.20 కోట్లుపైనే ప్రజాధనాన్ని వృథా చేశారనే ఆరోపణలు అప్పట్లో గట్టిగా వినిపించాయి. ఈ నేపథ్యంలో వైజాగ్‌కు చెందిన పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ 2020 మార్చిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)ని ఆశ్రయించారు. దీనిపై సంబంధిత శాస్త్రవేత్తల బృందం మడ అడవుల విధ్వంసం నిర్ధారించి, వెంటనే ధ్వంసం చేసిన మడ చెట్లను పునరుద్ధరించాలని రూ.5 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని అప్పట్లో ఆదేశాలు జారీ చేసింది.

ఎన్‌జిటి ఆదేశాలు పట్టని అధికారులు

తన తప్పు తెలుసుకున్న వైసిపి ప్రభుత్వం గతేడాది మార్చిలో అపరాధ రుసుంను ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్‌కు జమ చేసి చేతులు దులుపుకుంది. నగరపాలక సంస్థ అధికారులు మాత్రం ఈ సైట్ కోర్టు స్టేటస్ కో ఆర్డర్ పరిధిలో ఉన్నట్లు అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే మడ మొక్కల సంరక్షణ మాత్రం మరిచిపోయింది. తూతూమంత్రంగా సుమారు పదివేల మొక్కలను నాటినట్టు అధికారులు చెబుతున్నప్పటికీ ప్రస్తుతం అక్కడ ఒక మొక్క కన్పించిన దాఖలాలు లేవు. అయితే వేసిన మొక్కలు పూర్తిగా ఎండిపోయి వాటి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. అనధికారంగా మెరక చేసిన ప్రాంతంలో మట్టిని కూడా తొలగించకుండానే అధికారులు ఎన్‌జిటి ఆదేశాలను పూర్తిగా విస్మరిస్తున్నారనే విమర్శలు విపక్షాల నుంచి వినిపిస్తున్నాయి. వాస్తవానికి కంకర రాళ్లతో కూడిన గ్రావెల్ మట్టిని తొలగించి, గతంలో ఉన్న బురద నేలను కనబడేలా పునరుద్ధరణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ మూడేళ్లు గడుస్తున్నా అధికారులు అటువంటి చర్యలు ఏమీ తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాకినాడ నగరపాలక సంస్థతోపాటు పోర్టు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంగా మడ అడవుల పునరుద్ధరణ, పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన

ప్రజాశక్తి - కాకినాడ
జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అన్ని సదుపాయాలను సమగ్రంగా ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం నమోదు, తొలగింపులు, సవరణల కొరకు అందిన దరఖాస్తుల పరిష్కారం, ఇవిఎంలు, వివిప్యాట్‌ల వినియోగంపై ఓటరు అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 1637 పోలింగ్ కేంద్రాలన్నింటిలో ఫర్నిచర్, లైటింగ్, ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను కల్పించడం పూర్తయిందని ఆమె తెలిపారు. అలాగే జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పూర్తయిందని తెలిపారు. తుని నియోజకవర్గానికి ప్రభుత్వ కళాశాల, ప్రత్తిపాడు నియోజక వర్గానికి మినర్వా డిగ్రీ కళాశాల, పిఠాపురం నియోజక వర్గానికి ప్రభుత్వ పాలిటెక్నిక్, కాకినాడ రూరల్ నియోజక వర్గానికి ఆదికవి నన్నయ యూని వర్సిటీ, ఎంఎస్ఎన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్, పెద్దాపురం నియోజకవర్గానికి ఎడిఆర్‌బిఎస్‌జెబి మహారాణి కళాశాల, కాకినాడ సిటీ నియోజకవర్గానికి మెక్లారిన్ హైస్కూల్, జగ్గంపేట నియోజకవర్గానికి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీలో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను కాకినాడ జెఎన్‌టియులో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 386 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు గుర్తించామని, వీటిలో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 80 ఏళ్ల పైబడిన ఓటర్లు, 40 శాతం పైబడిన శారీరక వైకల్యం కలిగిన ఓటర్ల కొరకు ఎన్నికల కమిషన్ కల్పించిన హోమ్ ఓటింగ్ వెసులుబాటును ఫారం-డి ద్వారా దరఖాస్తు ద్వారా వినియోగించుకునే విధానంపై కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ డి.తిప్పే నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరావు(వైసిపి), గదుల సాయిబాబా(టిడిపి), సిహెచ్.రమేష్ బాబు (బిజెపి), వి.చంద్రరావు(సిపిఎం), ఎస్.అప్పారావు (బిఎస్‌పి), కె.కృష్ణమోహన్ (ఆప్), ఎన్నికల అధికారులు ఎం.జగన్నాథం, రామ్ కుమార్ పాల్గొన్నారు.

కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కరప
కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పంతం నానాజీ సూచించారు. మండలంలోని ఆరట్లకట్ట గ్రామంలో తదేకం ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా దృక్పథంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు బత్తుల సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తదేకం ఫౌండేషన్ ప్రతినిధి చావ్వకుల సందీప్, కరప, రూరల్ మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి, కరెడ్ల గోవింద్, కరప మండల టిడిపి అధ్యక్షులు దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్ వీరంరెడ్డి ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులను అరికట్టేందుకు గోవులకు వాక్సినేషన్

ప్రజాశక్తి - అన్నవరం
అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంకు చెందిన గోవులకు వ్యాధులు రాకుండా వాక్సినేషన్ వేయించారు. బుధవారం కొండపైన మరియు కొండ దిగున ఉన్న గోశాలలో ఉన్న 190 ఆవులకు అన్నవరం వెటర్నరీ సర్జన్ డాక్టర్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో సిబ్బంది వాక్సినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో గోసాల పర్యవేక్షణ అధికారి ఐవి.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.


గోవుకు వాక్సినేషన్ చేస్తున్న సిబ్బంది

జర్నలిస్టుపై దాడికి ఖండన

ప్రజాశక్తి - గండేపల్లి
సిద్ధం సభలో తమ విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టుపై వైసిపి కార్యకర్తలు చేసిన దాడిని నిరసిస్తూ మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ వైసిపి పాలనలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టును తరిమి తరిమి దాడి చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే జర్నలిస్టుపై దాడి చేసిన వైసిపి కార్యకర్తలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు టి.రామచంద్రరావు, వల్లభ శ్రీనివాస్, కె.శ్రీనివాస్, ఎల్.పండు, పాల్గొన్నారు.


గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

గ్రామ సింహాల స్వైర విహారం

ప్రజాశక్తి - గండేపల్లి
మండలంలో ప్రతి గ్రామంలో గ్రామ సింహాలు విచ్చలవిడిగా స్వైరా విహారం చేస్తున్నాయి. దారిని పోయే బాటసారులు, మోటార్ సైకిల్‌పై వెళ్లేవారిపై ఒక్కసారిగా దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. స్థానిక సంత మార్కెట్లో, ప్రధానమైన కూడళ్లు, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే వారిపై మూకుమ్మడిగా దాడికి పాల్పడుతున్నాయి. విద్యార్థులను ఒంటరిగా స్కూలుకు పంపాలంటే తల్లీదండ్రులు బయపడాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. కుక్కలు, కోతుల వ్యవహారాన్ని ఇప్పటికే పలు దఫాలుగా పంచాయితీ అధికారులు, గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కలు, కోతుల భారీ నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

హైస్కూల్ పీడీపై విచారణ

ప్రజాశక్తి - రౌతులపూడి
మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న వై.నానిబాబుపై ఆర్‌జెడి నాగమణి, ఐసిడిఎస్ పిడి ప్రవీణ విచారణ నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం గర్జనపుడిలో పీడీగా విధులు నిర్వర్తించిన సమయంలో నానిబాబు విద్యార్థునుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వారు ములగపూడి ఉన్నత పాఠశాలను సందర్శించి పీడీ వ్యవహారంపై విచారణ చేపట్టారు. నాడు ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన అంశాలపై ఆరా తీవారు. అలాగే స్థానిక హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులతోనూ వారు భేటీ అయ్యారు. పీడీ వ్యవహార శైలిపైనా స్థానిక విద్యార్థుల నుంచి సమాచారాన్ని రాబట్టారు. అనంతరం పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలలో చదువుతున్న బాలికలను ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలుగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు , స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో అమ్మ భాషకు అందలం

ప్రజాశక్తి - కాకినాడ
సాంకేతిక వికాసంతో భాషా, సాహిత్యాలు ప్రజలందరికీ చెందుతున్నాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ అన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాలలో హిందీ తెలుగు, హిందీ, సంస్కృత శాఖల ఆధ్వర్యంలో బుధవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.తిరుపాణ్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సొంత ప్రాంతానికి చెందిన భాషలో ప్రవేశం, ప్రావీణ్యం సంపాదించుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఆధునిక సాంకేతికత, సామాజిక మాధ్యమాల మూలంగా అమ్మ భాష ప్రస్తుతం అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం వల్ల వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో రాణించగలమని అన్నారు. పిఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు కర్రి భామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నన్నయ విశ్వ విద్యాలయం తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ టి.సత్య నారాయణ మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం వల్ల తెలుగు అంతరించిపోదన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మాతృభాషతో పాటు తప్పనిసరిగా మరో భాషను నేర్చుకోవాలని చెప్పారు. చారిత్రక రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి కోసం వేరే భాషను నేర్చుకోవాలని, అయితే జాతి ఉనికి అమ్మ భాషతోనే ముడిపడి ఉంటుందని అన్నారు. తదుపరి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె. ఆంజనేయులు, పి.హరిరామప్రసాద్, వై.బుజ్జి, టి.రాజశేఖర్, కె.అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

విద్యాప్రదాత నాయకర్‌కు ఘనంగా నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం
విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతిని జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కాకినాడ** స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ వ్యవస్థాపకులు మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతి బుధవారం జరిగింది. ఎంఎస్ఎన్ చారిటీస్ చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, చారిటీస్ సహాయక కమిషనర్, కార్యనిర్వాహణాధికారి ఆర్‌వి. చందన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి దుర్గాప్రసాద్, ఎంజికె.కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని కోరంగి పంచాయతీ పెద్దబొడ్డు వెంకటాయ పాలెంలో అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓలేటి నరసింహ స్వామి, పి.సత్తి బాబు, దండుప్రోలు ఆది నారాయణ, శ్రీను, రేకాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో నాయకర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ నాయకర్ సేవలను కొనియాడారు. కాకినాడలో వేల ఎకరాల ఆస్తులను విద్యాభివృద్ధికి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ హరిబాబు, అధ్యాపకులు డాక్టర్ అజయ్ రతన్, డాక్టర్ జోసఫ్ స్టీఫెన్, డాక్టర్ హారిక, తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పెద్దాపురం నుంచే పోటీ చేస్తా: చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం
పెద్దాపురం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని సిట్టింగ్ ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తాను ఇక్కడ నుంచి పోటీ చేయడం లేదని తానంటే గిట్టని వారు లేనిపోని ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. తనకు ఆరోగ్యం బాగాలేదని సోషల్ మీడియాలో కొందరు వీడియోలు విడుదల చేయటం దారుణమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తనను ఎన్నికల ప్రచారం చేసుకోమని చెప్పారన్నారు. తాను 2014లో పెద్దాపురం ఎంఎల్‌ఎగా విజయం సాధించిన తరువాత నియోజకవర్గంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేశానన్నారు. 2019లో పెద్దాపురం ప్రజలు తనకు 2వ సారి ఎంఎల్‌ఎగా అవకాశం ఇచ్చారని, తాను నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతూ ప్రజలతోనే ఉన్నానని తెలిపారు. తాను చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు రెండోసారి తనకు అవకాశం ఇచ్చారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అడబాల కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న చినరాజప్ప

కార్టూన్ 'నిజం'



జయహో బిసి సభ జయప్రదానికి కృషి

ప్రజాశక్తి - జగ్గంపేట
ఈ నెల 25న పెద్దాపురంలో జరిగే జయ హో బిసి సభను విజయ వంతం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని ఇర్రిపాకలో నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటి సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అంటేనే బీసీల పార్టీ అని, టిడిపి పాలనలోనే బిసిలకు తగిన రాజకీయ గుర్తింపు వచ్చిందన్నారు. ఫిబ్రవరి 25న పెద్దాపురం నియోజకవర్గంలో కాకినాడ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ జయహో బిసి సభ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఇన్‌ఛార్జ్‌లు, బిసి నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ సభలో నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, బిసిలు పెద్దఎత్తున పాల్గొనేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 26 నుంచి మార్చి 7 వరకూ ఇర్రిపాకలో కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం జరుగనుందనీ, తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, అడబాల వెంకటేశ్వరరావు, జీను మణిబాబు, జాస్తి వసంత్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

బాలికలు చదువులో రాణించాలి


విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ మౌనిక, డాక్టర్ సత్యానందరావు

ప్రజాశక్తి - సామర్లకోట
ఇంటర్ స్థాయిలో బాలికలు చదువే లక్ష్యంగా చేసుకుని అడుగులు వేయాలని ఎస్ఐ వి.మౌనిక, ప్రముఖ వైద్యులు డాక్టర్ పసల సత్యానందమ్ సూచించారు. స్థానిక సాయి ఐశ్వర్య మహిళా జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం కళాశాల డైరెక్టర్ కరణం శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఇంటర్ విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకు తావు లేకుండా, ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ చదువే లక్ష్యంగా జీవితంలో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మోసాలకు గురి కాకుండా దిశా యాప్ విద్యార్థినులు వినియోగించుకోవాలన్నారు. వేసవి సెలవులను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఇంటర్లో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థినిలకు సర్టిఫికెట్లు, షీల్డ్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సేపైనా సురేష్, ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, ఎఒ అనిల్, కళాశాల ఇన్‌ఛార్జ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రెడ్ బుక్ డే

ప్రజాశక్తి - కాకినాడ
సి పి ఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో రెడ్ బుక్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా విప్లవ సారధి లెనిన్ జీవితం - కృషి అనే పుస్తకంపై అధ్యయనం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఎం నాయకులు సిహెచ్.అజయ్‌కుమార్, సిహెచ్.రమణి, కె.వీరబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పి.రామకృష్ణ, పలివెల వీరబాబు, జుత్తుక శ్రీనివాస్, టి.రాజా, వి.చంద్రరావు, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తక పఠనం చేస్తున్న సిపిఎం నాయకులు

వీరేశ్వరరావును పరామర్శించిన హరీష్

ప్రజాశక్తి - తాళ్లరేవు
మండలంలోని ఇంజరం గ్రామ టిడిపి అధ్యక్షుడు కాట్రు వీరేశ్వరరావును అమలాపురం పార్లమెంటు టిడిపి ఇన్‌ఛార్జ్ గంటి హరీష్ మాధూర్, చంద్రబాబు నాయుడు టూర్ ప్రోగ్రాం కమిటీ సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పరామర్శించారు. వీరేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు ధూళిపూడి వెంకటరమణ, మోపూరి వెంకటేశ్వరరావు, ఆకెళ్ళ వి.యస్.నాగేశ్వరరావు, రేలంగి శ్రీకాంత్, దొరబాబు, కోరుకొండ అప్పారావు, సురేష్, తదితరులున్నారు.

నేరాలు ఘోరాలు



250 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారులో పోలవరం కాలువ సమీపంలోని పుంతరోడ్డులో 250 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ లక్ష్మణరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన దామ ఖార తన ముగ్గురు స్నేహితులతో కలిసి దారకొండ నుంచి మహారాష్ట్రకు 12 సంచుల్లో 250 కేజీల గంజాయిని ఒక వాహనంలో తరలిస్తున్నాడు. గండేపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. దీంతో పోలీసులకు అనుమానం రాకుండా ఒక ట్రాక్టర్‌లో గంజాయి బస్తాలను వేసి పోలవరం కాలువ సమీపంలోని పుంతరోడ్డుకి తరలించారు. అక్కడ వేరే వాహనంలోకి గంజాయిని లోడు చేస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ, సిబ్బందితో దాడి చేసి పటుట్కఉన్నారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీకున్నారు. గంజాయితోపాటు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.దామ ఖారను పెద్దాపురం కోర్టులో హజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

పేకాడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-చాగల్లు

పేకాట స్థావరాలపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.నాగరాజు తెలిపారు. చాగల్లు గ్రామ శివారులో పేకాడుతున్నట్టు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడి చేసి నిందితులను పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.6,680 నగదు, పేక ముక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.



విద్యార్థులతో శ్రీ చైతన్య యాజమాన్యం

పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో జరిగిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్టులో విశేష ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నగదు బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ డివివి.విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు నగదు బహుమతులు అందుకున్నారని తెలిపారు. పాఠశాలకు చెందిన వై.హర్ష(6వ తరగతి) 7వ తరగతికి చెందిన ఎన్. ప్రణవ్, వర్మ, వి.హేమంత్, జి. యశ్వంత్, ఎం.కార్తీక్ నగదు బహుమతులు సాధించారని చెప్పారు. అలాగే మరో 16 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారని, 37 మంది విద్యార్థులు సర్టిఫికెట్స్ సాధించారన్నారు. పాఠశాల డీన్ వెంకటరత్నం, సి బ్యాచ్ ఇన్‌ఛార్జ్ అశోక్ కుమార్, ఇతర ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎంవి సురేష్, కాకినాడ రీజనల్ ఇన్‌ఛార్జ్ పి.గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమ పాలన : చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద బ్రహ్మ దేవమ్ గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నాశనం అయిందని, జగన్ తన పైశాచిక ఆనందంతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఒకసారి బటన్ నొక్కినందుకే 50 ఏళ్ల వెనక్కి వెళ్ళామని, మరోసారి జగన్‌కు అనుకూలంగా ఓటు అనే బటన్‌ను నొక్కితే రాష్ట్రాన్ని ఎవరు కాపాడలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టిడిపి నాయకులు పాలకుర్తి శ్రీనివాసాచార్యుల చౌదరి, పెంకె వెంకటేష్, చీకట్ల వెంకటేష్, పాలకుర్తి రవి, అడ్డాల వెంకన్న బాబు, ముసిరెడ్డి శ్రీరాములు, సిహెచ్ దొరబాబు, ఇంటి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



గవర్నర్ తమిళసైకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంఎల్‌ఎ అశోక్

మత్స్యకారుల పరిహారానికి గవర్నర్ ఆమోదం

ప్రజాశక్తి - యానాం

మత్స్యకారులకు ఒఎన్‌జిసి నుంచి రావాలసిన నష్టపరిహారానికి సంబంధించిన ఫైలుకు బుధవారం లెఫ్టినెంట్ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఆమోదం తెలిపారని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొత్తం 5,289 మందికి పరిహారం అందించేందుకు గవర్నర్ ఆమోదించారన్నారు. ఛీఫ్ సెక్రటరీ ఆమోదం పొందిన తర్వాత జిఒ విడుదల చేస్తారన్నారు. అనంతరం ఒఎన్‌జిసి సంస్థకు పంపిస్తామన్నారు. తరువాత సంస్థ నుంచి సొమ్ము ప్రభుత్వ ఖాతాకు జమ చేసిన వారం పది రోజుల్లోనే మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తారన్నారు. మరో 173 మందికి లేబర్ డిపార్‌మెంట్‌లో రిజిష్టర్ చేసుకున్నారని తెలిపారు. వారికి రెండవ జాబితాలో వచ్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. పరిహారం అందేలా కృషి చేసిన పుదుచ్చేరి సిఎం రంగసామిని కలిసి కృతజ్ఞతలు తెలిపి దుస్సాలువాతో సత్కరించారు.



ఆక్వా కల్చర్ కార్మికులకు సేఫ్టీ కిట్లు అందజేస్తున్న ఆర్‌ఎఒ మునిస్వామి

రక్షణ పరికరాల కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి - యానాం

మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక సర్కిల్ ది యానాం ఫంక్షన్ హాల్లో ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ భీమవరం వారి ఆధ్వర్యంలో ఆక్వాకల్చర్ షెడ్యూల్ కులాల కార్మికులకు చెరువుల్లో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎఒ మునిస్వామి పాల్గొని ఆక్వాకల్చర్ పై రైతులకు వివరించారు. అనంతరం వారికి సేఫ్టీ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి డి.గొంతియ్య, కొండమూరి భాస్కరరావు, ఈలప్రోలు విష్ణువర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను ఆది ద్రావిడ సంక్షేమ, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇలంగోవన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు సత్కరించుకున్నారు. అనంతరం ఆది ద్రావిడ సంక్షేమ పథకాలు, ఇతర డెవలప్‌మెంట్ పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పేద కుటుంబాలకు వ్యాపార నిమిత్తం రుణాలు మంజూరు చేయాలని ఆయనను ఎంఎల్‌ఎ కోరారు.

23న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

అదనపు హై టెన్షన్ వైర్లు మరమ్మతులు కారణంగా ఈనెల 23న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు యానాం నియోజవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ లంక కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని 22వ డివిజన్‌లోని కోరట్ల వారివీధిలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాలును ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువిశాల ప్రాంగణంలో గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్‌లతో అధునాతన సౌకర్యాలు, విశాల ప్రాంగణంలో ఈ కమ్యూనిటీహాలు నిర్మించామన్నారు. ఇప్పటికే గొల్లపేట, సూర్యనారాయణపురంలలో రెండు కమ్యూనిటీహాల్స్‌తోపాటు దీనిని అదనంగా నిర్మించినట్టు చెప్పారు. యాదవ కులస్తులకు అన్ని విధాల అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ ఎస్‌ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్‌ఇ వెంకటరావు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అవార్డులు, సత్కారాలు

ప్రజాశక్తి - యంత్రాంగం



యు.కొత్తపల్లిలో వాలంటీర్లను సత్కరిస్తున్న ఎంపి వంగా గీత

జిల్లాలోని పలు మండలాల్లో వాలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులు ఇచ్చి సత్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొని వాలంటీర్ల సేవలను కొనియాడారు. **కాజులూరు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులు అందజేశారు. ఎంపిపి మాత భారతి అధ్యక్షతన జరిగిన ఈ కారక్రమంలో రామచంద్ర ^పురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పాల్గొని మాట్లాడారు. వైసిపి పాలనలో బడుగు, బలహీనవర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించాలన్నా లక్ష్యంతోనే వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు, వైస్ ఎంపిపి పెద్దిరెడ్డి వెంకటరమణ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నరాల సుబ్బరాజు, పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వాలంటీర్ల సేవా పురస్కారాల ప్రధానోత్సవ సభలో పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడారు. వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సేవలందించడంలో ప్రాముఖ్యత కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, ఎంపిపి పెంకే సత్యవతి, వైసిపి పట్టణ అధ్యక్షులు కాపు గంటి కామేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎంపి వంగ గీత పాల్గొని మాట్లాడారు. వాలంటీర్ల సేవలు మరువలేని వని, వారి శ్రమను గుర్తించే ఈ పురస్కారాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆనాల సుదర్శన్, వైస్ ఎంపిపిలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, వైసిపి నాయకులు రావు చిన్నారావు, కారే శ్రీనివాస్, వడిశెట్టి నారాయణరెడ్డి, సర్పంచులు నక్క మణికంఠ, రావి రమేష్, పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కళ్యాణం

ప్రజాశక్తి - సామర్లకోట



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండలంలోని పెదబ్రహ్మదేవంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మలకల సూరిబాబు ఆధ్వర్యంలో పండితులు పానింగపల్లి శ్రీనివాసాచార్యులు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. కళ్యాణ పీటలపై కంటిపూడి గోపాలం, భానుమతి దంపతులు ఆశీనులై పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, సామర్లకోట మండలం అధ్యక్షులు బొబ్బరాడ సత్తిబాబు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మోరంపూడి రంగా, ఎంపిటిసి సభ్యులు వైవిబి.ప్రసాదరావు, శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, తోటకూర శ్రీనివాస ప్రకాశరావు స్వామిని దర్శించుకున్నారు. కళ్యాణ పూజల అనంతరం భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని అచ్చంపేట, జి.మేడపాడు గ్రామాల్లో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి కళ్యాణ వేడుకల్లో పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి: మాజీ ఎంఎల్‌ఎ



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండబాబు

ప్రజాశక్తి - కాకినాడ

తెలుగుదేశం పార్టీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన లీగల్ సెల్ సమావేశంలో పలువురు న్యాయవాదులు కొండబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగాపడ్డారని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ప్రజాధనాన్ని జగన్ ప్రభుత్వం దోచుకుంటుందని అన్నారు. బినామీ పేర్లతో దాచుకోవడం తప్ప వైసిపి నాయకులకు అభివృద్ధి తెలియదని ఎద్దేవా చేశారు. వైసిపి పాలనలో యువకులకు ఉద్యోగ అవకాశాలు లేవని, మహిళలకు రక్షణ లేదన్నారు. దళితులపై దాడులు చేస్తూ పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. లా నేస్తం సంక్షేమ నిధులను కొంతమందికే అమలు చేసి న్యాయవాదులను మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జవహర్ అలీ, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు దండుప్రోలు నాగబాబు, అశోక్ కుమార్, ప్రతాప్ కుమార్, బండి నరేంద్ర, న్యాయవాదులు నక్కా శ్రీనివాస్, వంకా అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి - గండేపల్లి

గుంటూరులో జరిగిన కోనేరు లక్ష్మయ్య మెమోరియల్ ట్రోఫీలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 19 నుంచి 21 వరకూ జరిగిన ఈ ట్రోఫీలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి లితఫడ్జ్వం లి లిపెట్రోలియంలి 3వ సంవత్సరం చదువుతున్నాడు. కె . ఎల్. యూనివర్సిటీ ఫెస్ట్ లో రన్నింగ్ రేస్లో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ కు చెందిన విద్యార్థి కాంస్య పతకం సాధించాడు. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జి. ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

హ్యాక్‌థాన్ పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థి అభినందిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హ్యాకథాన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రజ్వలన్-2К24 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీల్లో ఎఐఎంఎల్, సిఎస్‌సి, ఇసిఇ, ఐటి విభాగాల్లో 6 బృందాల విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థి బృందాలు ఈ హ్యాకథాతోన్‌లో తమ అంశాలని ప్రదర్శించగా, మొదటి 15 బృందాలలో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 6 బృందాలు చోటు దక్కించుకున్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ఆర్ అండ్ డి. డాక్టర్ కెవిఎస్ఆర్.మూర్తి, డీన్ ఇవాల్యుయేషన్ ప్రొఫెసర్ జె.పవన్, డీన్ కెరీర్ డెవలప్‌మెంట్ జెడి. వెంకటేష్, డీన్ అడ్మినిస్ట్రేషన్ వి.సత్యనారాయణ, తదితరులు విద్యార్థి బృందాలను అభినందించారు.

బాణసంచా పోటీల్లో ప్రసాద్‌కు బహుమతి

ప్రజాశక్తి - పెదపూడి



బహుమతిని అందుకున్న ప్రసాద్‌కు అభినందనలు చెబుతున్న స్థానికులు

ఉషా, పద్మిని, ఛాయా, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవంలో నిర్వహించిన బాణానంచా పోటీల్లో కరప ప్రసాద్, పందలపాక గోవిందు జట్లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో 15 మార్కులు తేడాతో కరప ప్రసాద్ బహుమతి కైవసం చేసుకున్నాడు. బాణాసం చాపోటీలకు ప్రధాన న్యాయనిర్ణేతగా మాజీ జడ్‌పిటిసి జెడ్ పిటిసి సత్తి భగవాన్ రెడ్డి వ్యవరించారు. అలాగే గ్రామానికి చెందిన ద్వారంపూడి తేజారెడ్డి, కర్రి గంగాధర్ రెడ్డి, ఉద్దండం లక్ష్మణరావులు సహాయ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బాణానంచా పోటీలో గెలుపొందిన ప్రసాద్‌కు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఎన్‌ఐవిఎన్‌ఎ రెడ్డి చేతుల మీదుగా 1 కాసు బంగారం బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా విజేత ప్రసాద్ మాట్లాడుతూ బాణానంచా పోటీ అనేది ఖర్చుతోపాటు అత్యంత ప్రమాదంతో కూడుకున్నదని, అయినా ఎప్పటి నుండో గొల్లల మామిడాడ శ్రీసూర్యదేవుని సన్నిధిలో బాణాసంచా పోటీలలో పాల్గొని విజయం సాధించాలనే కోరిక ఉండేదని, అది నేటికి నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శ్రీనురెడ్డి, కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, ఉత్సవ కమిటీ మేడపాటి అమ్మిరెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, సత్తినానిరెడ్డి, పప్ప చిన్నారెడ్డి, ద్వారంపూడి కృష్ణారెడ్డి, ద్వారంపూడి బంగారెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, కర్రి గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

వార్డులో పర్యటించిన చైర్‌పర్సన్, కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ జె.రామారావులు పర్యటించారు. వార్డులో ఉన్న సమస్యలపై వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు వారు బుధవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న డ్రయినేజీ సమస్యలతోపాటు, ఇతర సమస్యలను కౌన్సిలర్ వారికి వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమస్యలను పరిష్కరించాలని వారిని కోరారు. అలాగే వార్డులో పలువురు వాలంటీర్లు చెప్పిన మాట వినడం లేదని, ప్రజలకు ఏ మాత్రం అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు సమస్యల పరిస్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.